సాక్షి నిజామాబాద్

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



పరిహారం..పరిహాసం

మూడేళ్ల క్రితం చెరువు తెగి పంటల్లో ఇసుక మేటలు వేయగా రైతులకు ఇప్పటివరకు పరిహారం అందించలేదు.

- 8లో ▸



బాల్‌భవన్ పిలుస్తోంది..

మరికొన్ని రోజుల్లో విద్యార్థులకు పరీక్షలు ముగియనుండగా నగరంలోని బాల్‌భవన్ వేసవి శిక్షణనిచ్చేందుకు సిద్ధమైంది.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.4 /22.3

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది. రాత్రి చలిగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ: 6:34	మంగళ: 4:46

యాసంగి గట్టెక్కేదెలా..?



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

- శ్రీరాంసాగర్ నుంచి ఈ సీజన్‌కు 63 టీఎంసీలు కేటాయింపు
- పూర్తయిన నీటి కోటా..!
- అదనంగా మరో వారం మాత్రమే నీటి విడుదలకు అవకాశం
- అప్పటివరకు పంటలు చేతికందని పరిస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుత యాసంగి సీజన్‌కు కేటాయించిన నీటి కోటా పూర్తికాగా, మరోవారం పాటు అదనంగా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. అయితే వరి పంట చేతికందేందుకు మరో 20 రోజుల సమయం పడుతుందని, వారంలోగా నీటి విడుదలను నిలిపేస్తే తమ పరిస్థితి ఏమిటని అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

బాల్కొండ : ప్రస్తుత ఏడాది యాసంగి సీజన్‌కు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నంచి 63 టీఎంసీల నీటిని కేటాయించారు. ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి వారం వరకు యాసంగి సీజన్‌కు నీటి విడుదలను చేపట్టేవారు. కాని గతేడాది డిసెంబర్ 16 నుంచే కాలువల ద్వారా నీటి విడుదలను ప్రారంభించడంతో ఈ ఏడాది 15 రోజులు ముందుగానే నీటి సరఫరాను నిలిపేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. మార్చినెల చివరి నాటికే కేటాయించిన కోటా కంటే ఓ టీఎంసీ నీటిని అదనంగా కూడా వినియోగించారు. మరో వారంరోజులు నీటి విడుదల కొనసాగిస్తామంటున్నారు. అంటే మరో 3.5 టీఎంసీల నీటి వినియోగం జరుగుతుంది. అయినా పంటలు గట్టెక్కే అవకాశం లేదు. యాసంగి సీజన్‌లో కూడా వరి పంటను అధికంగా సాగు చేశారు. వరి పంట చేతికందేందుకు కనీసం మరో 20 రోజులు సమయం పడుతుంది. నీటి సరఫరా వారంలో నిలిపేస్తే పంటకు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉంది. నీటి విడుదల చేపడితే కోటాకు మించి నీటి సరఫరా చేపట్టాల్సి ఉంటుంది.

కాలువల ద్వారా నీటి విడుదల ఇలా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుత యాసంగి సీజన్‌కు అన్ని కాలువల ద్వారా, ఎత్తిపోతల పథకాల ద్వారా ఇప్పటిదాకా 64 టీఎంసీల నీటి సరఫరా చేపట్టారు. కాకతీయ కాలువ ద్వారా 4,441 టీఎంసీలు, సరస్వతి కాలువ ద్వారా 6.096 టీఎంసీలు, లక్ష్మీ కాలువ ద్వారా 2.326 టీఎంసీలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1.3 టీఎంసీలు, ఆవిరి రూపంలో 4.955 టీఎంసీలు, గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 3.91 టీఎంసీలు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 2.35 టీఎంసీలు, వరద కాలువ ద్వారా 1.24 టీఎంసీల నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 250 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 540 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 599 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1069(26 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ప్రాజెక్ట్‌లో ఉన్నది 26టీఎంసీలే..

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 26 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ 5 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, ఆవిరి రూపంలో 5 టీఎంసీల నీరు పోతే 11 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుంది. అందులో అధికారులకు ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 3.5 టీఎంసీల నీరు వినియోగం జరుగుతుంది. అంటే మిగిలేది 7.5 టీఎంసీలు మాత్రమే. కనీసం ఏప్రిల్ 20 వరకు నీటి విడుదల చేపడితే పంటలు గట్టెక్కుతాయి. ఈ లెక్క ప్రకారం అంటే మరో 7 టీఎంసీల నీటి వినియోగం జరుగుతుంది. చివరికి ప్రాజెక్ట్‌లో 15 టీఎంసీల నీరు మాత్రమే మిగులుతుంది. గతేడాది ఖరీఫ్ ప్రారంభం వరకు 22టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

నేటి నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్‌అర్బన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఆరు పేపర్లతోనే పరీక్షలు జరగనున్నాయి. సీసీ కెమెరాలు నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థితో పాటు, ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌పై కూడా చర్యలు తీసుకోనున్నారు. హాల్‌టికెట్లపై ప్రధానోపాధ్యాయుడి సంతకం లేకున్నా అనుమతి ఉంటుందని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

138 పరీక్ష కేంద్రాలు

పదో తరగతి పరీక్షల కోసం జిల్లాలో 138 సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 21,645 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. సోమవారం నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఎనిమిది మంది రూట్ ఆఫీసర్లు, 138 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. 138 సిట్టింగ్ స్క్వాడ్, ఏడు ఫ్లయింగ్ బృందాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే 9030282993 నంబర్‌కు ఫోన్ చేయాలి. హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో కూడా ఉచితంగా తీసుకెళ్లనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆదివారం డీఈవో దుర్గాప్రసాద్ పరిశీలించారు.

డబుల్ ఇళ్ల పంపిణీకి మోక్షం



మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- మోర్తాడ్‌లో నిర్మాణం పూర్తయిన 224 ఇళ్లు
- 166 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తి

మోర్తాడ్ : మోర్తాడ్‌లో ఇల్లు లేని పేద కుటుంబాలకు అధికారులు శుభవార్త చెప్పారు. 224 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో కేటాయింపులను పూర్తి చేయడానికి లబ్ధిదారులను ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 750 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి ఇందులో 166 మందిని అర్హులుగా గుర్తించారు. వారి జాబితాను గ్రామ పంచాయతీలో, తహసీల్దార్ ఆఫీస్‌లో ప్రదర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులను ఎంపిక చేయగా ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని అధికారులు సూచించారు. నిర్మించిన ఇళ్ల సంఖ్య ఎక్కువగా ఉండగా ఎంపిక చేసిన అర్హుల సంఖ్య తక్కువగా ఉంది. మరో 58 ఇళ్లను కేటాయించడానికి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. మిగిలిపోయిన ఇళ్లను కేటాయించడానికి మరోమారు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించే అవకాశం ఉంది. ఈనెల రెండో వారంలో డబుల్ బెడ్‌రూం గృహాల ప్రవేశ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తుంది. మోర్తాడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం 2015లో అప్పటి మంత్రి పోచారం శంకుస్థాపన చేశారు. ఎనిమిదేళ్లకు లబ్ధిదారుల ఎంపిక చేయడం గమనార్హం.

న్యూస్‌రీల్

త్వరలోనే యాసంగి కొనుగోళ్లు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : యాసంగి సీజన్ వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని, తొందరపడి తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించవద్దని కోరారు. ఒకవేళ ఎక్కువిస్తే అమ్ముకోవాలన్నారు.

పట్టుబడ్డ వాహనాల కోసం ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలి

ఖలీల్‌వాడి : పోలీసుల తనిఖీలో దొరికిన వాహనాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు పోలీసువర్గాలు తెలిపాయి. వాహనాదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో www.nizamabadpolice.in తెలుసుకోవాలని లేదా 9491328002కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. పోలీసుల తనిఖీలో 225 వాహనాలు ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. వీటికి సంబంధించిన పత్రాల ద్వారా వాహనాలను తీసుకొని వెళ్లాలని లేకపోతే ఆర్నెళ్ల తర్వాత వేలం వేస్తామన్నారు.

పది పరీక్షల్లో మంచి గ్రేడ్ సాధించాలి



డిచ్‌పల్లి : ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి పదోతరగతి పరీక్షల్లో మంచి గ్రేడ్ సాధించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతసదన్‌ను ఆదివారం డీఈవో సందర్శించారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. కార్యక్రమంలో సదన్ కేర్‌టేకర్ అందే రమేష్, సిబ్బంది సంధ్యారాణి, విజయ్, గంగమణి, గాయత్రి, సంధ్య, రాజేశ్వర్, నాని, అనిత, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులపై టోల్ భారం

- టికెట్‌పై రూ.10 పెంపు

ఖలీల్‌వాడి : జాతీయ రహదారులపై టోల్ చార్జీలను 5 శాతం పెంచడంతో ఆ భారాన్ని ఆర్టీసీ ప్రయాణికులపై మోపింది. మార్చి 31 అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ టోల్‌ప్లాజాలు ఉన్న మార్గాల్లో టికెట్‌పై రూ.10 పెంచింది. ఉమ్మడి జిల్లాలో ఇందల్వాయి, భిక్కనూర్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. నిర్మల్ జిల్లా సోన్ వద్ద టోల్‌గేట్ ఉంది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీకి రూ.330 చార్జీ ఉండగా రూ.340 అయింది. కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.100 ఉండగా రూ.110 అయింది.

బ్యాంకు అధికారులకు టోకరా

కామారెడ్డి క్రైం: నోట్లు లెక్కించే మిషన్‌కు మరమ్మతులు చేసే టెక్నిషియన్ అంటూ వచ్చిన ఓ వ్యక్తి బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించి రూ. 50 వేలతో ఉడాయించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని విద్యానగర్ యాక్సిస్ బ్యాంక్ శాఖకు శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి వచ్చి బ్యాంకు క్యాషియర్‌ను కలిశాడు. తాను యాక్సిస్ బ్యాంక్‌కు సంబంధించిన నోట్లు లెక్కించే యంత్రాలకు సర్వీసింగ్ చేస్తానన్నారు. బ్యాంకు అధికారులు వివరాలు అడిగిన తర్వాత అతడిని క్యాష్ కౌంటర్ లోపలికి అనుమతిచ్చారు. క్యాష్ కౌంటర్‌లోని ఓ మిషన్‌ను పరిశీలించడానికి రూ.50 వేల నోట్ల కట్టను ఇచ్చారు. మిషన్‌ను పరిశీలించిన అనంతరం ఆ వ్యక్తి మిషన్ నోట్లను సరిగా లెక్కించడం లేదని, మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్ కొనుక్కుని వస్తానని చెప్పి మిషన్‌ను తనవెంట తీసుకువెళ్లాడు. రూ. 50 వేల నోట్ల కట్ట అందులోనే ఉన్న విషయాన్ని బ్యాంకు అధికారులు మరిచారు.మిషన్ తీసుకెళ్లిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో ఆదివారం బ్యాంకు మేనేజర్ ఆదినారాయణ మూర్తి కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో సాగాలి



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

సుభాష్‌నగర్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని వక్తలు పేర్కొన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని వినాయకనగర్‌లోగల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత తదితరులు నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌మాట్లాడుతూ.. మొగల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన ధీశాలి సర్వాయి పాపన్న అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ సర్వాయి పాపన్న పోరాటం ఆదర్శనీయమన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పాపన్న గౌడ్ ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుకు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

బల్దియా ఆదాయానికి గండి

- టౌన్‌ప్లానింగ్, లైసెన్సు సర్వేయర్లదే కీలకపాత్ర
- అక్రమంగా భవన నిర్మాణాలకు ఫీజులు తగ్గించే ప్రయత్నం
- కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ఇంటి దొంగలే..
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నిజామాబాద్ నాగారం : మున్సిపాలిటీలో ముడుపులిస్తే ఏదైనా సాధ్యమేనని అధికారులు నిరూపిస్తున్నారు. బల్దియాకు సక్రమంగా వచ్చే ఆదాయాన్ని రాకుండా లబ్ధిదారుల నుంచి అందినకాడికి దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులే బల్దియాకు ఆదాయం రాకుండా అడ్డుపడుతున్నారు. ఇందులో కొంతమంది టౌన్‌ప్లానింగ్, లైసెన్సు సర్వేయర్లు పక్కా పథకం ప్రకారం అక్రమాలు చేసి కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ముడుపులందుకుంటున్నారు.

మచ్చుకి ఒకటి..

నగరంలోని వినాయక్‌నగర్‌లోని పూలాంగ్ వాగు ప్రాంతంలో సుమారు 6వేల గజాల్లో భవన నిర్మాణానికి పర్మిషన్ కోసం 2021లో ఫైల్‌నం. 003626/బీపీ/డీటీసీపీ/3072/0022/2021 దరఖాస్తు పెట్టారు. ఇందుకు రూ.2,50,95,483 ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ దరఖాస్తును పెండింగ్‌లో పెట్టారు. మళ్లీ ఫైల్ నం. 000047/బీపీ/డీటీసీపీ/3072/0001/2022 దరఖాస్తు పెట్టారు. ఇందుకు రూ. 95,36,108 ఫీజు చెల్లించారు. ఏకంగా పెద్దమొత్తంలో అంటే సుమారుగా రూ. 1కోటికి పైగా దరఖాస్తుదారుడికి లబ్ధి చేకూర్చి మున్సిపల్ ఆదాయానికి గండికొట్టారు. ఇందుకుగాను లైసెన్సు సర్వేయర్, టౌన్‌ప్లానింగ్ అధికారుల మధ్య పెద్దఎత్తున ముడుపు బాగోతం నడిచిందని సమాచారం. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులకు కూడా భారీగా ముట్టజెప్పి తక్కువ ఫీజుకే భవనానికి సంబంధించి పర్మిషన్ ఇప్పించినట్లు సమాచారం. తాజాగా సెట్ బ్యాక్ పేరుతో మూడో దరఖాస్తు 000007/బీపీ/డీటీసీపీ/0001/2023ను పెట్టారు. ఇందులో మరికొంత ఫీజు తగ్గించేందుకే టౌన్‌ప్లానింగ్ అధికారులే దగ్గరుండి కథ నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి.

దరఖాస్తు ఇక్కడ.. అనుమతి హైదరాబాద్ నుంచి

నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 1000 గజాల లోపు స్థలంలో భవనాలు నిర్మిస్తే అనుమతి ఇక్కడే తీసుకోవచ్చు. 1000 గజాలపైన స్థలంలో భవనాలు నిర్మిస్తే కచ్చితంగా హైదరాబాద్‌లోని డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) నుంచి అనుమతి పొందాల్సిందే. అయితే దరఖాస్తు మాత్రం ఇక్కడే పెట్టాలి. దరఖాస్తు ప్రక్రియ అంతా మున్సిపాలిటీ పరిధిలోని టౌన్‌ప్లానింగ్, కొంతమంది లైసెన్సు సర్వేయర్లు చేయాల్సిందే. ఇక్కడి అధికారుల ప్రమేయం లేకుండా దరఖాస్తు పైకి వెళ్లదు. మున్సిపాలిటీ పరిధిలో 1000 గజాల లోపల స్థలాల్లో నిర్మించే భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. దరఖాస్తుదారుడికి లబ్ధి చేకూర్చి మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏళ్ల తరబడిగా టౌన్‌ప్లానింగ్‌లో ఇదే త తంగం నడుస్తోంది.

ఉన్నతాధికారులు ఉన్నట్టా.. లేనట్టా..?

మున్సిపాలిటీలో రోజుకో అక్రమ వ్యవహారం బయటకు వస్తూనే ఉంది. శానిటేషన్ నుంచి టౌన్ ప్లానింగ్ వరకు ప్రతి శాఖలో అవినీతి పేరుకుపోయింది. అయితే కార్పొరేషన్‌ను గాడినపెట్టి ప్రక్షాళన చేయాల్సిన కార్పొరేషన్ ఉన్నతాధికారి పట్టించుకోవడం లేదని శాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నట్లు సమాచారం. ఆధారాలతో సహా పత్రికల్లో కథనాలు వస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ కుంభకోణంపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా ప్రస్తుతం నెలకు రూ. 10 లక్షలకు పైగా ఆదా అవుతున్న విషయం విదితమే.

నీళ్లు పాతాళానికి..

- వేగంగా పడిపోతున్న భూగర్భజలాలు
- జిల్లాలో సగటున 11.42 మీటర్లు..
- చీమన్‌పల్లిలో 27.83మీటర్ల లోతులో..
- వట్టిపోతున్న బోరుమోటార్లు.. ఎండుతున్న వరి పంటలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : భూగర్భజలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. రోజురోజుకూ పాతాళానికి చేరుతున్నాయి. జిల్లాలో సగటున 11.42 మీటర్ల లోతులోకి చేరాయి. అత్యధికంగా సిరికొండ మండలం చీమన్‌పల్లిలో 27.83 మీటర్ల లోతులో జలాలున్నాయి. ఎండలు ముదరడం, పంట పొలాలకు నీటి వినియోగం పెరగడంతో బోరు మోటార్లు వట్టిపోతున్నాయి. వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా యాసంగి గట్టెక్కితే మేలనే భావనలో రైతాంగం ఉంది. రానున్న రోజుల్లో మరింత లోతుకు పడిపోయే అవకాశాలున్నాయని భూగర్భజలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా భూగర్భజలశాఖ ఆధ్వర్యంలో 82 పీజోమీటర్లు ఉన్నాయి. ప్రతినెలా ఈ మీటర్ల ద్వారా భూగర్భజలాలు కొలుస్తారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ.. జలమట్టాలు ఆశించిన మేర ఎత్తుకు చేరలేదు. పైగా తొందరగా లోతుల్లోకి పడిపోతున్నాయి. ఎంత త్వరగా భూగర్భజలాలు పెరిగాయో.. అంతే తొందరగా పడిపోతున్నాయి. జిల్లాలో యాసంగిలో 4 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. వరి మినహా ఇతర పంటల కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. అక్కడక్కడ వరి కోతలు కూడా ప్రారంభయ్యాయి. కొన్నిచోట్ల మరో నెల రోజులపాటు వరికి నీటిపారుకం అవసరముంది.

నీటి నిల్వలు ఖాళీ..

జిల్లాలో సగటున 11.42 మీటర్ల లోతుల్లోకి చేరాయి. చాలా మండలాల్లో నీటి నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. ఆర్మూర్, భీంగల్, బోధన్, డిచ్‌పల్లి, కమ్మర్‌పల్లి, రెంజల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, వేల్పూర్, తదితర మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ, మోపాల్, బాల్కొండ నియోజకవర్గంలో భీంగల్, ముప్కాల్, మోర్తాడ్, బోధన్‌లోని బోధన్, తదితర మండలాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో మాక్లూర్, నిజామాబాద్ నగరంలో కూడా భూగర్భ జలమట్టాలు అడుగంటాయి.

అత్యధిక లోతులో ఉన్న ప్రాంతాలు

ఫీజోమీటర్ ప్రాంతం/ఊరు	మండలం	మీటర్లు
చీమన్‌పల్లి	సిరికొండ	27.83
గోన్‌గొప్పుల	భీంగల్	27.58
పాకాల	సిరికొండ	26.53
గడ్కోల్	సిరికొండ	24.45
మోపాల్	మోపాల్	23.77
ముషీర్‌నగర్	సిరికొండ	22.60
చిన్నమావంది	బోధన్	22.49
తాళ్లపల్లి	భీంగల్	22.04
దండిగుట్ట	రెంజల్	21.28
సిరికొండ	సిరికొండ	21.12
కంఠేశ్వర్	నిజామాబాద్ ఉత్తర	20.56

పెరిగిన నీటి వినియోగం..

జిల్లాలో వరి సాగు నేపథ్యంలో నీటి వినియోగం విపరీతంగా పెరిగింది. దీనికితోడు ఉష్ణోగ్రతలు పెరగడంతో పొలాల నుంచి నీరు ఆవిరే కా కుండా నీరు భూమిలోకి త్వరగా ఇంకిపోతుంది. దీంతో బోరుమోటార్లు వట్టిపోతున్నాయి. పంట చేతికి రావాలంటే నెలరోజుల సమయముంది. భూగర్భ జలాలు పడిపోతుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

వరికి వినియోగం ఎక్కువ..



వరి పంటకు నీటి అవసరం ఎక్కువగానే ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి పంట అధికంగా సాగైంది. పంట చివరి దశలో నీటి వినియోగం అధికంగా కావాలి. అందుకే భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. ఆరుతడి పంటలకు నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. అవసరం మేరకే నీటిని వాడుకోవాలి.

– ఆర్ దేవేంద్ర ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జలశాఖ

క్లుప్తంగా

జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సుద్దపల్లి శివారులోగల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం జిల్లా మినీ సబ్‌- జూనియర్ (అండర్‌-10) సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు జైడి రాజ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. క్రీడాకారులు చిన్న వయసులోనే జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొనడం సంతోషకరమైన విషయమన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని, దేశానికి, రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నీరజ రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగా మోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, ప్రిన్సిపల్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్ నగర్‌లోని అభ్యాస స్కూల్‌లో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్‌-17 బాలబాలికల విభాగంలో ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. బాలురలో రూపేంద్ర దత్త అంకిత్, అభిరామ్‌లు, బాలికల్లో నాగజోష్నిక, రోషిణిలు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఎస్‌వైకే కోఆర్డినేటర్ బెల్లాల్ శైలీ అభినందించారు. చెస్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, ఆర్బిటర్ బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం..

- 2019లో తెగిన సిరికొండ మండలంలోని మైసమ్మ చెరువు కట్ట
- పొలాల్లో నిండిన ఇసుక మేటలు, రాళ్లు
- మూడేళ్లు గడిచినా అందని నష్టపరిహారం



పొలాల్లో వేసిన ఇసుక మేటలు(ఫైల్)



తెగిన మైసమ్మ చెరువు కట్ట (ఫైల్)

సిరికొండ: మండలంలోని జినిగ్యాల గ్రామ సమీపంలోగల అటవీ ప్రాంతంలో మైసమ్మ చెరువు 2019లో భారీ వర్షాలకు నిండిపోయింది. అకస్మాత్తుగా కట్ట తెగిపోవడంతో చెరువు కింద ఉన్న వ్యవసాయ పంట భూములు మట్టి, ఇసుక, రాళ్లతో నిండిపోయాయి. దీంతో అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఘటన జరిగి మూడేళ్లు దాటినా బాధిత రైతులకు ఇంకా పరిహారం అందలేదు.

ముప్పైఏళ్ల క్రితం చెరువు నిర్మాణం..

మండలంలోని జినిగ్యాల గ్రామ సమీపంలోగల అటవీ ప్రాంతంలో మైసమ్మ చెరువును ముప్పై ఏళ్ల క్రితం 1995 నుంచి 1998వ సంవత్సరం వరకు పీపుల్స్‌వార్ నక్సలైట్లు సమీప గ్రామాల రైతులతో కలిసి శ్రమదానంతో నిర్మించారు. చెరువుకు అలుగు, తూములు లేకపోవడంతో స్టోరేజీగా ఉపయోగపడేది. అడవి జంతువులకు దాహార్తిని తీర్చేది. అటవీ ప్రాంతానికి చెరువు సమీపంలో ఉండటంతో కొద్దిపాటి వర్షాలకే చెరువు పూర్తిగా నిండిపోయేది. చెరువు అటవీ ప్రాంతంలో ఉండటంతో మిషన్ కాకతీయ నిధులు మంజూరు కాలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చెరువు కట్ట మూడుసార్లు తెగిపోయింది. రెండుమార్లు అటవీశాఖ అధికారులు తెగిన కట్టకు మరమ్మతులు చేయించారు. 2019లో కట్ట తెగినపుడు మాత్రం వరద ఉధృతి ఎక్కువగా ఉండి పంట భూములకు భారీ నష్టం జరిగింది. చెరువులోని వరద నీరంతా కట్ట కింద ఉన్న పొలాల్లో నుంచి ప్రవహించడంతో పంట భూములు పూర్తిగా రూపురేఖలు కోల్పోయాయి. పంట భూముల్లో ఎక్కడా చూసినా ఇసుక, మట్టి, పెద్దపెద్ద బండరాళ్లు నిండిపోయాయి. తెగిన చెరువు కట్టకు మరమ్మతులు చేశారు. కానీ నష్టం వాటిల్లిన రైతులకు మాత్రం పరిహారం అందలేదు.

73 ఎకరాల్లో పంట నష్టం..

మైసమ్మ చెరువు కట్ట కింద 42మంది రైతులకు చెందిన 73ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేసి నివేదిక రూపొందించారు. ఈ భూముల్లో పంటలతో పాటు బోరు బావులు ధ్వంసమయ్యాయి. బోరుబావుల్లో మట్టి, రాళ్లు నిండిపోవడంతో మోటార్లు, పైపులు అందులోనే ఇరుక్కుపోయాయి. మోటార్లకు విద్యుత్ ప్రసారం జరిగే సర్వీస్ వైర్లు తెగిపోయి కొట్టుకుపోయాయి. పంట భూముల్లో మట్టి, ఇసుక మేటలు, రాళ్లను తొలగించి తిరిగి సాగు భూములుగా మార్చుకోవడానికి రైతులకు రూ.లక్షలు ఖర్చు అయ్యాయి. భూముల్లో పెట్టిన రాళ్లను ఇసుకను తొలగించడానికి జేసీబీలు, ట్రాక్టర్లు రోజుల తరబడి నడవాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

ఐదెకరాల్లో దెబ్బతిన్న పంట..



చెరువు కింద నాకు తొమ్మిది ఎకరాల వరకు భూమి ఉంది. చెరువు కట్ట తెగడంతో ఐదు ఎకరాల్లో పంటలు, సారవంతమైన మట్టి పూర్తిగా కొట్టుకుపోయి ఇసుక మేటలు, రాళ్లు నిండిపోయాయి. మరో నాలుగు ఎకరాల్లో ఒడ్లు తెగిపోయి పంట ధ్వంసమైంది. రెండు బోర్లు మోటారుతో సహా తుడిచిపెట్టుకుపోయాయి. భూమిని మళ్లీ పంట పండేలా అభివృద్ధి చేసుకోవడానికి ఏడాది సమయం పట్టింది. సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చయ్యాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం త్వరగా అందించాలి.

–సవాయిలాల్, రైతు

5 నుంచి విశ్వశాంతి మహాయాగం



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలో ఈ నెల 5 నుంచి 79వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం జరుగనుంది. జిల్లా కేంద్రంలోని మారుతినగర్ కలెక్టరేట్ బైపాస్‌రోడ్డు హనుమాన్ ఆలయం వెనుక ఖాళీ స్థలంలో దీనికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో 16రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. అయుత చండీ, తిరుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకాలు నిర్వహించనున్నారు. యాగాలు చేయనున్నారు. దీనికిగాను ప్రత్యేకంగా వేసిన యాగశాలలో యజ్ఞకుండాలను ఏర్పాటు చేశారు.

అందరికీ ఉచితం..



యాగంలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ధ్యానం, ఉపనిషత్ భాష్యం, ఉదయం 11 గంటలకు మధ్య గవద్గీత, భాగవతంపై స్వామిజీ అమృత భాష్యాలు ఉంటాయి. ఈ యాగంలో, పూజల్లో, హోమంలో, అభిషేక, అర్చనల్లో అందరూ ఉచితంగా పాల్గొనవచ్చు.

–కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ

గ్రామాల్లో ‘బలగం’ ప్రదర్శన

- ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు
- చిత్రాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో బలగం చిత్రాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

బాల్కొండ: తెలంగాణ యాసలో, కుటుంబ కథ నేపథ్యంతో తెరకెక్కిన బలగం చిత్రాన్ని ప్రస్తుతం పల్లెల్లో ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలో కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్‌లో మొదటిసారి చిత్రాన్ని ప్రదర్శించారు. అక్కడి నుంచి ప్రతి రోజు ఏదో ఒక ఊర్లో చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. బాల్కొండ మండలంలో జలాల్‌పూర్, బాల్కొండ, నాగాపూర్ గ్రామాల్లో, ముప్కాల్ మండల కేంద్రంలో మండలంలోని రెంజర్ల, వేంపల్లిలో, వేల్పూర్ మండలం పడగల్, మోర్తాడ్ మండలం పాలెంలో, ఏర్గట్ల మండల కేంద్రంలో ఇదివరకే చిత్ర ప్రదర్శన చేపట్టారు. గతంలో పల్లెల్లో బుర్ర కథలు, ఒగ్గు కథలు ప్రదర్శనలు నిర్వహించగా.. గ్రామస్తులు వాటిని చూడటానికి చాపలు పట్టుకుని వెళ్లేవారు. ప్రస్తుతం బలగం చిత్ర ప్రదర్శనలకు సైతం ప్రజలు అలా వెళ్లడంతో నాటి రోజులను గుర్తుకు తెస్తున్నాయంటున్నారు.

సినిమా బాగుంది..



బలగం సిన్మాలో ఇంట్లో పెద్ద దిక్కు చచ్చిపోతే ఎలా ఉంటాదో కళ్లకు కట్టినట్లు చూపించారు. సిన్మా చూసినంత సేపు నన్ను నేను మరిచిపోయాను. సిన్మా బాగుంది. చిత్రాన్ని ఊళ్లో చూపెట్టడం ఆనందంగా ఉంది.

– నీరడి గంగారాం, జలాల్‌పూర్

బంధం విలువ తెలిపింద్రు..



బలగం సిన్మాలో అన్న, తమ్ముడు, అయ్యా, అవ్వ ఇలాంటి బంధాలను గురించి చక్కగా చూపించారు. ఎంత మంది బలగం ఉన్నా.. పోయేటప్పుడు ఎవరు వెంట రారు. ఉన్నన్ని దినాలు అందరితో మంచిగా ఉండాలని సెప్పడం బాగుంది. సిన్మా చూసి కన్నీళ్లు పెట్టుకున్నాను.

– ఎర్ర గంగారాం, జలాల్‌పూర్

ఇలాంటి సినిమాను చూస్తాననుకోలేదు..



ఇప్పటి రోజుల్లో ఇలాంటి సినిమాను చూస్తాననుకోలేదు. గతంలో ఊళ్లలో చనిపోతే బుర్ర కథ చెప్పించేవాళ్లం అంటు మా పెద్దలు సెప్పగా విన్నాను. కానీ సినిమాలో చూసాను. ఆ కథ వింటుంటే కన్నీళ్లు ఆగలేవు. సినిమాను గ్రామస్తులందరితో కలిసి చూడటం ఆనందంగా ఉంది.

– అనిల్, జలాల్‌పూర్

అ‘పూర్వ’ ఆత్మీయ సమ్మేళనం



నిజామాబాద్ నగర కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాల 1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరవైఐదు ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి తరలి వచ్చారు. దీంతో వారు ఒకొరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, సౌజన్య, కళ్యాణి, రమ్య, ప్రణతి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో జరిగిన నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఒకరు మృతిచెందారు. మరొకరికి గాయాలయ్యాయి. అలాగే నిజామాబాద్‌లో కంఠేశ్వర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెండు బైక్‌లు యూటర్న్ తీసుకుంటుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి శివారులోని హైవేపై ఓ బైక్‌ను డీసీఎం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. పిట్లం మండలంలో కారు-బైక్ ఢీకొనగా ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు.



నవీన్‌కుమార్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన నవీన్‌కుమార్ (38) పండుగ నిమిత్తం ఇటీవల ముదక్‌పల్లిలోని సూదులమ్మ వద్దకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. ఆదివారం ఒక్కడే బైక్‌పై కంఠేశ్వర్‌కు బయలుదేరాడు. బాడ్సికి చెందిన కటికె శంకర్ తన మనవరాలితో కలిసి టీవీఎస్ ఎక్సల్‌పై మోపాల్ నుంచి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న నవీన్‌కుమార్ ఢీకొన్నారు. ప్రమాదంలో నవీన్‌కుమార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శంకర్‌కు ఎడమ కాలు విరిగింది. మృతుడికి భార్య ప్రణవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. నవీన్‌కుమార్ గల్ఫ్ నుంచి ఆరునెలల క్రితం వచ్చాడు. వేరే దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు జరుతున్న సమయంలోనే మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై పోలీసులను అడుగగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యూటర్న్ తీసుకుంటుండగా..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. నగరానికి చెందిన తోట గిరిధర్ రావు శనివారం రాత్రి రైల్వే కామన్ వైపు వెళుతుండగా.. బేకర్స్ వ్యాలీ వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ బైక్‌పై వెళుతున్న మటం పవన్ కుమార్ యూటర్న్ తీసుకోవడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో గిరిధర్‌రావు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. పవన్‌కుమార్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై శ్రవణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో..



రాజు మృతదేహం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెంట్రాజ్‌పల్లి శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై వెళుతున్న బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన సలిగంటి రాజు(32) ఆదివారం ఉదయం తన పాపను తీసుకుని ధర్పల్లి మండలం లోలం గ్రామంలోని అత్తగారింటికి వెళ్లాడు. పాపను అక్కడే దింపి మధ్యాహ్నం తిరిగి పిప్రికి తన బైక్‌పై బయలుదేరాడు. బైక్ మెంట్రాజ్‌పల్లి శివారులోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాజు ఎగిరిపడి రోడ్డుమీద పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు–బైక్ ఢీకొనగా..

పిట్లం(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి గేట్ వద్ద పిట్లం - బాన్సువాడ రహదారిపై ఆదివారం రాత్రి కారు, బైక్ ఢీకొనగా ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండలం అన్నారం గ్రామానికి చెందిన లక్ష్మన్ (28) బైక్‌పై బాన్సువాడ నుంచి అన్నారం గ్రామానికి వస్తుండగా.. బ్రాహ్మణపల్లి గేట్ వద్ద పిట్లం - బాన్సువాడ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న లక్ష్మన్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారు డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పిట్లం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

బతికుండగానే పోస్టుమార్టం గదికి..

- అంబులెన్స్ టెక్నీషియన్, గాంధీ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం
- గమనించిన జీజీహెచ్ పోస్టుమార్టం గది వార్డ్‌బాయ్స్
- ప్రస్తుతం చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు



చికిత్స పొందుతున్న అబ్దుల్ గఫార్

నిజామాబాద్ సిటీ: బతికుండగానే ఓ వ్యక్తిని పోస్టుమార్టం గదికి తరలించిన సంఘటన నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ గఫార్, హైమద్, సద్దాం శుక్రవారం సాయంత్రం మద్యం సేవించి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా తిర్మన్‌పల్లిలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో గఫార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైమద్ ఓ మోస్తరుగా, సద్దాం స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు గఫార్, హైమద్‌లను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. గఫార్‌ను పరీక్షించిన వైద్యులు అతడి మెదడులో రక్తం గడ్డకడుతోందని, సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అతడిని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అంబులెన్స్‌లోనుంచి గఫార్‌ను దింపడానికి వచ్చిన వార్డుబాయ్స్ గఫార్ పరిస్థితిని చూసి ఇతడు చనిపోయే స్థితిలో ఉన్నాడని, ఆక్సిజన్ పైప్ తీసేస్తే మరణిస్తాడని, అనవసరంగా ఇక్కడి దాకా తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ మాటలకు గఫార్ భార్య ఆందోళనకు గురై ఇక గఫార్ చనిపోయినట్లుగానే భావించింది. పోస్టుమార్టం కోసం గాంధీలో అయితే ఆలస్యమవుతుందని భావించి శనివారం నేరుగా నిజామాబాద్ జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. వైద్యులను సంప్రదించకుండానే నేరుగా పోస్టుమార్టం గది వద్దకు తీసుకెళ్లారు. అనంతరం నిజామాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆదివారం ఉదయం వచ్చి పంచనామా చేస్తామని, అప్పటివరకు మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచాలని చెప్పడంతో గఫార్‌ను గదికి తరలించారు. అక్కడ వార్డుబాయ్స్ గఫార్ నోట్లోనుంచి ఆక్సిజన్ పైప్‌ను తొలగిస్తుండగా అతడు ఒక్కసారిగా దమ్ముతీశాడు. కంగారు పడిన వార్డుబాయ్స్ విషయాన్ని గఫార్ కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వెంటనే జీజీహెచ్ వైద్యులతో మాట్లాడారు. వైద్యులు గఫార్‌ను ఐసీయూకు తరలించారు. అయితే గఫార్‌కు చికిత్స చేసేందుకు సరైన పరికరాలు ఇక్కడ లేవని, గాంధీకే తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆదివారం మధ్యాహ్నం తిరిగి గాంధీకి తీసుకెళ్లారు. గఫార్‌ను పోస్టుమార్టం గదిలో వార్డ్‌బాయ్స్ పరిశీలించి ఉండకపోతే అతడు ప్రాణాలు కోల్పోయేవాడు.

పల్స్ కూడా చూడకుండానే..

విషమ పరిస్థితిలో ఉన్న పేషంట్లను ఆక్సిజన్ సౌకర్యం ఉన్న అంబులెన్స్‌లో తరలిస్తారు. వెంట టెక్నీషియన్ కూడా ఉంటారు. అయితే గఫార్‌ను తీసుకెళ్లిన అంబులెన్స్ టెక్నీషియన్ కనీసం పల్స్ చెక్ చేయకుండానే పోస్టుమార్టం గదికి తీసుకెళ్లడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయమై గఫార్ కుటుంబ సభ్యులు టెక్నీషియన్‌ను ప్రశ్నిస్తే ఆక్సిజన్ పైప్ తీసివేస్తే అతడు చనిపోతాడని గాంధీ ఆస్పత్రి వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు చెప్పడంతో తాను పోస్టుమార్టం గదికి తీసుకెళ్లానని చెప్పాడు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామశివారులోగల కాళేశ్వరం కెనాల్‌లో శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఏఎస్సై దయాళ్‌సింగ్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లికి చెందిన రేవల్లి గంగాధర్(35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రెండ్రోజుల క్రితం తన అత్తగారిల్లు మోపాల్‌కు వచ్చాడు. శనివారం సాయంత్రం అతడు మోపాల్‌కు చెందిన మిర్యాల లక్ష్మణ్, తెనుగు వినోద్‌తో కలిసి సిర్‌పూర్ శివారులో నూతనంగా నిర్మించిన కెనాల్ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టేందుకు వెళ్లి శరీరానికి వల చుట్టుకుని ఊపిరాడక మృతి చెందాడు. కానీ గంగాధర్ మృతి విషయంలో మిగతా ఇద్దరిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన జీపీ ట్రాక్టర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని శ్రీరాంనగర్ తండాకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్, ట్యాంకర్ ఆదివారం మంచిప్పలో బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. జీపీ ట్రాక్టర్ డ్రైవర్ ట్యాంకర్‌లో నీటిని నింపుకుని మొక్కలకు పట్టేందుకు వస్తున్నాడు. మంచిప్ప రైతువేదిక మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ సాయిలుకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి..

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ సమీపంలో శనివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి బైక్ అదుపుతప్పి గాయాలపాలయ్యాడని ఎస్సై వినయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మెట్‌పల్లి వైపు నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(35) బైక్ అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. స్థానికులు అతడిని అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడ్డ వ్యక్తి డిచ్‌పల్లి మండలానికి చెందిన వ్యక్తిగా తెలిసిందన్నారు. ఎవరైన వ్యక్తుల ఆచూకీ లేనట్లయితే వేల్పూర్ ఎస్సై 8712659862 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో కూలీకి..

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చేస్తుండగా ఆదివారం ఓ కూలి విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. అడవి మామిడిపల్లి వద్ద మూడేళ్లుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. కాగా పనుల్లో భాగంగా సందీప్ అనే కూలీ బ్రిడ్జి పైకెక్కి పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడిని సంబంధిత కాంట్రాక్టర్ చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నర్సన్నపల్లికి చెందిన ద్యాప నవీన్ గత 9నెలలుగా కుటుంబంతో కలిసి గురు రాఘవేంద్ర కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 1న కుటుంబంతో కలిసి సంగారెడ్డికి వెళ్లారు. శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంటో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని బీరువా, సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన 1.6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పూజ సామగ్రి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.